క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న రాజ్యసభ ఎంపీ సుబ్బారెడ్డి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదర మెట్ల గ్రామానికి చెందిన కర్నాటి హనుమంత రావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి రూ. 3 లక్షల చెక్కు మంజూరు కావడంతో గురువారం తాడేపల్లిలో రాజ్యసభ సభ్యుడు వైవీసుబ్బారెడ్డి చెక్కును ఆర్యవైశ్య సంఘం నాయకులకు అందజేశారు. తనకు ఆర్థికంగా సహాయం చేయడానికి సహకరించిన సుబ్బారెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మార్టూరు: రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ మీడియట్ పరీక్షలలో భాగంగా మండల కేంద్రం మార్టూరులో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ ఎంసీహెచ్ వస్త్రం నాయక్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 227 మంది, రాయల్ జూనియర్ కళాశాలలో 495 మంది, హర్షిణి జూనియర్ కళాశాలలో 325 మంది మొత్తం 1047 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

ఎమ్మార్పీఎస్ సదస్సు కరపత్రాల ఆవిష్కరణ



బల్లికురవ: ఎస్సీ వర్గీకరణ కోరుతూ శనివారం అద్దంకిలో జరిగే ఎమ్మార్పీఎస్ సదస్సుకు మాదిగలంతా తరలిరావాలని బాపట్ల జిల్లాల ఆసంఘ అధ్యక్షుడు బీ. లక్ష్మీ నరసయ్య, మండల ఎమ్మార్పీస్ అధ్యక్షుడు కందుకూరి పేతురు పిలుపు నిచ్చారు. గురువారం బల్లికురవలో సదస్సుకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ కార్యకర్తలు నాయకులు తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు.

అనుమతి లేకుండా గ్రానైట్ తరలిస్తే జరిమానా

బల్లికురవ: అనుమతి లేకుండా గ్రానైట్ రాళ్లు, స్లాబులను అక్రమంగా తరలిస్తే కేసులతో పాటు పెనాల్టీలు తప్పవని మైన్స్ విజిలెన్స్ ఏడీ వీరేష్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం వేమవరం జంక్షన్ సమీపంలో పర్మిట్‌లు లేకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ శ్లాబుల లారీని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న బాలాజీ

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పావులూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేసుకున్న భవనాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ పులఖండం రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు గ్రామంలోని పీఏసీఎస్ పెట్రోలు బంకు, పీఏసీఎస్ నూతన గోడౌను, గ్రామ సచివాలయం-2 నూతన భవనం, రైతుభరోసా కేంద్రం, జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఉపాధి హామీ నిధులతో నిర్మాణం చేసిన ప్రహరీ, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త యడం బాలాజీ, మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి, యువనాయకుడు గాదె మధుసూదనరెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

భారీ మెజార్టీతో గెలుపు ఖాయం..



విలేకరులతో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



పార్టీలో చేరిన వారితో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

- నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక

మేదరమెట్ల: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులందరూ భారీ మెజారిటీలతో గెలుపొందడం తద్వారా తిరిగి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడం ఖాయమని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కొరిశపాడు మండల పరిధిలో గల పీ.గుడిపాడు జాతీయ రహదారి పక్కన ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న సిద్ధం సభ ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ వైఎస్సార్ సీపీ సభలు ఏర్పాటు చేసినా లక్షల మంది ప్రజలు స్వచ్ఛందంగా సభకు హాజరౌతున్నారని, సభలకు వచ్చిన ప్రజల స్పందన చూస్తుంటే ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందామా అని ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత చూస్తే 2014లో చంద్రబాబు పాలనలో లంచాలు, దోపిడీలు, దళారులు ఉండేవారని, 2019 నుంచి జగనన్న పాలనలో అలాంటి వాటికి తావులేకుండా నేరుగా లబ్ధిదారులకు మాత్రమే అందేలా సంక్షేమ ఫలాలను అందించారన్నారు. ఈరెండు ప్రభుత్వాల పాలనలో తేడా గమనించిన ప్రజానీకం తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సిద్ధం సభకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన సాగుతున్నాయని సుమారు 15 లక్షల మంది హాజరయ్యేలా హాజరైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు సాగుతున్నాయని హనిమిరెడ్డి తెలిపారు.

30 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక..

సంతమాగులూరు (అద్దంకి): నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి నాయకులు, కార్యకర్తలు కుటుంబాలకు కుటుంబాలు చేరుతున్నారు. తాజాగా సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం గ్రామానికి చెందిన 30 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరంతా బత్తుల రామచంద్రరావు, శివయ్య ఆంజనేయులు, ఓగిబోయిన వీరయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈసందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి వలసలు భారీగా పెరిగాయన్నారు. ముందు ముందు మరిన్ని చేరికలు ఉంటాయని చెప్పారు. సంతమాగులూరు మండలంలో పార్టీకి భారీ మెజారిటీ రావడం ఖాయమన్నారు. మిగిలిన మండలాల్లోనూ అదే స్థాయిలో మెజారిటీ ఈ సారి వస్తుందని చెప్పారు. టీడీపీ అంచనాలు తలకిందులయ్యే తరుణం ఆసన్నమైందన్నారు. ప్రజలంతా ఏ పార్టీ పాలన బాగుందో తెలుసుకున్నారన్నారు. తెలుసుకుని సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ వైపునకు మరలుతున్నారని చెప్పారు. మాకు విజయం తథ్యమని గర్వపడే నాయకులకు ఈ సారి ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీలోకి వచ్చే వారిని సాదరంగా ఆహ్వానించాలన్నారు. ప్రజల మన్ననలు పొంది మంచి నాయకుడని అనిపించుకునే విధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- 39 అంశాలలో రెండు అంశాలు రద్దు

చీరాల అర్బన్: చీరాల మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అజెండాలోని అంశాలపై కౌన్సిల్ చర్చ నిర్వహించారు. చీరాలలోని ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌కు నూతనంగా ఏర్పాటు చేస్తున్న భవన సముదాయాలకు స్థల దాతల పేర్లు పెట్టాలని 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు అన్నారు. వందేళ్ల చరిత్ర ఉన్న ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌కు స్థలదాతలు, భవన నిర్మాణ కర్తలు వేరు అయినా ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌గానే పలకరిస్తున్నారని, స్థలదాతలకు గుర్తింపు లేదన్నారు. ఇప్పటికైనా నిర్మిస్తున్న భవనాలకు స్థలదాతల పేర్లు పెట్టాలని సూచించారు. ఎన్నో ఏళ్లుగా అదే పేరుతో పిలుస్తున్నారని, ఇప్పుడు మార్చడం సరికాదని 16వ వార్డు కౌన్సిలర్ అన్నారు. ఇరువురు వాదనలపై స్పందించిన చైర్మన్ జంజనం శ్రీనివాసరావు స్థలదాతల వారసులు కలిసి ఒక తీర్మానానికి వచ్చి కౌన్సిల్‌కు అర్జీ ఇవ్వాలని సూచించారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చ జరగగా 7,17 అంశాలు రద్దు చేసి మిగిలిన అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ డీఈ ఐసయ్య, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

రథశాల నిర్మాణానికి భూమిపూజ



వాస్తు పూజ చేస్తున్న దాత హనుమంతురావు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో రథశాల నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. గతంలో దాత రాటకొండ హనుమంతురావు, గ్రామస్తులు విరాళాలతో రూ.1 కోటి వ్యయంతో రథ నిర్మాణం చేపట్టారు. ఈ రథాన్ని ఎండ, వర్షం నుంచి సంరక్షించేందుకుగాను రూ. 20 లక్షల వ్యయంతో దాత రాటకొండ హనుమంతురావు దంపతులు రథశాల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రధాన ఆలయానికి దక్షిణం వైపు రథశాల నిర్మాణం చేపట్టనున్నారు. ఈనేపథ్యంలో ఉదయం ఆలయంలో విఘ్నేశ్వరపూజ, సుదర్శన, వాస్తు హోమాలను ఆలయ అర్చకుడు దివి భావనాచార్యులు, అర్చక బృందం నారాయణం శ్రీనివాసాచార్యులు, వెంకట సందీప్ దీక్షిత్, మనోజ్ యాగక్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

యువత మద్దతు హనిమిరెడ్డికే



చిన హనిమిరెడ్డికి పుష్పగుచ్ఛాలతో మద్దతు తెలుపుతున్న యువకులు



చిన హనిమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన కమిషనర్

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని అనమనమూరు గ్రామానికి చెందిన యువకులు అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డిని గురువారం ఆయన కార్యాలయంలో కలసి తమ పూర్తి మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో షేక్ నాగూర్‌వలీ, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

హనిమిరెడ్డిని కలిసిన కమిషనర్..

అద్దంకి: స్థానిక మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ నెల్లూరు జిల్లా వెంకటగిరికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో కాకినాడ జిల్లా కార్యాలయం నుంచి ఎం సత్యనారాయణను అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు ఆయన కమిషనర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మను ఆయన కలిశారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బేతపూడి ప్రసాద్

చీరాల అర్బన్: చీరాల డీఎస్పీగా బేతపూడి ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై చీరాల డీఎస్పీగా వచ్చారు. చీరాల డీఎస్పీగా పనిచేసిన ప్రసాదరావు ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా చీరాల సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు, కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. 2019 ఎన్నికల సమయంలో ఆయన చీరాలలో సీఐగా పనిచేయడంతో చీరాల నియోజకవర్గంపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది.

భక్తిని ప్రబోధించే 'కాత్యాయని శతకం'



కాత్యాయని శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సృజన సభ్యులు

అద్దంకి రూరల్: భక్తిని ప్రబోధించేది 'కాత్యాయని శతకం' అని సృజన అధ్యక్షుడు, కవి గాడేపల్లి దివాకరదత్తు అన్నారు. గురువారం రాత్రి స్థానిక కమతేశ్వరస్వామి దేవస్థానంలో సృజన సాహిత్య సభ నిర్వహించారు. దీనిలో భాగంగా గాడేపల్లి కామేశ్వరీ రచించిన శ్రీకాత్యాయని శతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివాకరదత్తు మాట్లాడుతూ భక్తిని ప్రబోధాన్ని ఈ శతకంలో గంగా ప్రవాహంలా సాగిందన్నారు. శతావధాని నారాయణం బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ భక్తి శతకాల్లో కాత్యాయని శతకం మకుటాయమానంగా నిలుస్తుందన్నారు. ప్రముఖ కవులు, సమీక్షకులు పాలపర్తి జ్యోతిష్మతి, డీవీఎం సత్యనారాయణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, దేవపాలన, అన్నమనేని వెంకటరావు కాత్యాయని శతకాన్ని విశ్లేషించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), ఆర్‌వీ రాఘవరావు, ఆకుల యోగేశ్వరరావు, షేక్ మహమ్మద్ రఫీ, లక్కరాజు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మస్తాన్ మాస్టర్లు, మలాది శ్రీనివాసరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, బాలు,బత్తుల అంజయ్య, సీపీహెచ్ కోటయ్య, అద్దంకి లెవీ ప్రసాద్, అనంతు నాగేశ్వరరావు, చిన్ని రమేష్, గడ్డం సుబ్బారావు, హరనాథ్‌బాబు, వారణాసి రఘురామ శర్మ పాల్గొన్నారు.

108లో ప్రసవం, తల్లీబిడ్డ క్షేమం



108లో ప్రసవం చేసిన సిబ్బంది

బల్లికురవ: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ప్రసవానికి నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈఘటన బుధవారం అర్ధ రాత్రి నరసరావుపేట సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన జీ.దుర్గకు పురిటినొప్పులు అధికం కావటంతో స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. బల్లికురవ నుంచి వచ్చిన 108 వాహనం దుర్గను నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్తున్నారు. మార్గమధ్యంలోని పెట్లూరివారిపాలెం దగ్గర నొప్పులు అధికం కావటంతో ఈఎంటీ జే. మనోహర్, పైలట్ వీ. శ్రీకాంత్ వాహనాన్ని ఆపి ప్రసవం చేశారు. పండంటి బాబుకు జన్మనిచ్చింది. తదుపరి తల్లీబిడ్డను నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకు తీసుకెళ్లారు. సకాలంలో గ్రామానికి వచ్చి కాన్పుతో తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడినందుకు దుర్గ భర్త కనకయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

10518 రైతులకు సున్నావడ్డీ నగదు జమ

బల్లికురవ: మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల్లో 10518 మంది రైతులకు రూ.17.83 కోట్లు సున్నావడ్డీ, పీఎం కిసాన్ సొమ్ము ప్రభుత్వం నుంచి రైతుల ఖాతాలకు జమచేశారని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి గురువారం ఒక ప్రకటలనో తెలిపారు. 2020-21 రబీ కింద 1508 రైతులకు రూ.34.55 లక్షలు, 2022 ఖరీఫ్‌లో 309 మంది రైతులను రూ.8.52 లక్షలు, సున్నావడ్డీ కింద పీఎం కిసాన్ 16వ విడత కింద 8701మంది రైతులకు రూ.2 వేలు చొప్పున, రూ.17.4 కోట్లు జమచేసినట్లు కుమారి వివరించారు.

60 లీటర్ల నాటుసారా స్వాధీనం

చీరాల: నాటుసారాను గురువారం రాత్రి ఒన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒన్‌టౌన్ సీఐ పి.శేషగిరిరావు తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం జాండ్రపేటలోని శివాలయం వద్ద ఇద్దరు మహిళలు నాటుసారాను మూడు క్యాన్లలో ఇతర ప్రాంతం నుంచి అమ్మకానికి తీసుకువస్తున్నారు. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్ పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇరువురు మహిళలను అరెస్టు చేశారు. నాటుసారా తయారీ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ సేవలు విస్తృతం చేయాలి



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): రోటరీ సేవలను విస్తృత పరచాలని రోటరీ క్లబ్ జిల్లా ప్రతినిధులు సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ నిర్వహిస్తున్న వివిధ సర్వీస్ ప్రాజెక్టులను ఇప్పటి వరకు రోటరీ చేసిన అన్ని కార్యక్రమాలను పూర్వపు జిల్లా గవర్నర్‌లు వడ్లమాని రవి, జాష్టి రంగారావు, అన్నే రత్నప్రభాకర్, తాళ్ల రాజశేఖర్ రెడ్డి గురువారం సందర్శించారు. తగు సలహాలు, సూచనలతో పాటు మెగా ప్రాజెక్ట్స్ నిర్వహించాలని అందుకు తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు. రాబోవు మూడు సంవత్సరాలలో వంద మంచి నీటి చెరువులు అభివృద్ధికి సంసిద్ధమై తగిన ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. పర్చూరు వాగుపై మరిన్ని చెక్‌డ్యాంలను ఏర్పాటుకు జిల్లా రోటరీ నుంచి నిధులు ఏర్పాటు చేయిస్తామని వారు తెలిపారు. కార్యక్రమం రోటరీ పర్చూరు క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సీనియర్ సభ్యులు కొల్లా శివరామకృష్ణ ప్రసాద్, ఉదయభాస్కర్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం..





నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, సహకార శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, చీరాల నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్

చీరాల: సాక్షి దినపత్రిక డిప్యూటీ ఎడిటర్ భవనం వీరరాఘవరెడ్డి కుమారుడు భవనం అన్వేష్‌రెడ్డి–తేజస్వినిల వివాహ వేడుక గురువారం చీరాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, సాక్షి దినపత్రిక ఎడిటర్ వి.మురళి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్, మార్కెటింగ్, సహకార శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు పోతుల సురేష్, ఇతర ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.